క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



మోహనరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గంగవరం : ఇటీవల నెల్లిపూడి వాగులో గల్లంతు అయి మృతి చెందిన మోహనరావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, కొత్తాడ సర్పంచ్ కామరాజు దొర, నాయకులు బలుమూరి సత్యనారాయణ తదితరులు గొరగుమ్మి గ్రామంలో మోహనరావు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతగిరి: ఇంటర్ పూర్తయినా విద్యార్థులు డిగ్రీ కళాశాల చేరేందుకు అడ్మిషన్ రిజిస్ట్రేషన్ నేటితో ముగుస్తుందని, విద్యార్థులు గమనించాలని, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అలాగే ఇంటర్ పూర్తయినా విద్యార్థులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కళాశాలలో చేరేందుకు నేటిలో ముగుస్తుందని, ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. ప్రవేశానికి ఉచితం రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. బీఏ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సులు ఉన్నాయని, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్, హాస్టల్ సదుపాయం ఉందన్నారు. మరిన్న వివరాల కోసం 9490430356, 9000244642 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన నవయుగ కవి, కళాప్రపూర్ణ గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ తోపాటు పలువురు మాట్లాడుతూ జాషువా రచనలు, కవిత్వాలు తెలుగు సాహిత్యానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఆయన ప్రముఖ రచనలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



అన్నామణిని సన్మానిస్తున్న సిబ్బంది

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నమణి బుధవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమెను పాఠశాల నూతన ప్రిన్సిపాల్ మనోజ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఇక్కడ ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించిన ఆమె రంపచోడవరం మండల కేంద్రానికి బదిలీ అయ్యారు.

ఎంపీడీవో మృతికి సంతాపం



రమణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వీర కిషోర్, సిబ్బంది

మారేడుమిల్లి : నరసాపురం ఎంపీడీవో వెంకట రమణరావు మృతికి స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి, సచివాలయం సిబ్బంది బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీవో వీర కిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులు క్రితం అదృశ్యమైయిన ఎంపీడీవో వెంకట రమణరావు విజయవాడలోని ఏలూరు కెనాల్‌లో ఆయన మృతదేహం లభ్యం కావడం బాధాకరమన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండల పరిషత్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని వర్షం.. అపార నష్టం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- గెడ్డలు, వాగుల ఉధృతితో నిలిచిన రాకపోకలు
- ఈదురుగాలుల బీభత్సం
- కూలిన విద్యుత్ స్తంభాలు.. అంధకారంలో గ్రామాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

అనంతగిరి/పెదబయలు/ముంచంగిపుట్టు : తుఫాను ప్రభావంతో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. శివారు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గిరిజనులంతా గ్రామలకే పరిమితమయ్యారు. పంట పొలాలు నీట మునిగాయి. రహదారులు దెబ్బతిన్నాయి. కల్వర్టులు, కాజ్‌వేలు కోతకు గురయ్యాయి. పలుచోట్ల ఇళ్లు నేలమట్టమయ్యాయి. భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చాలా గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక గిరిజనులు అంధకారంలో అలమటిస్తున్నారు. భారీ వృక్షాలు రహదారికి అడ్డంగా కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జనజీవనం స్తంభించింది. ఎరతెరిపిన వర్షాలతో మన్యంలో అపార నష్టం వాటిల్లింది. పెదబయలు మండలంలో మత్స్యగెడ్డ పొంగి ప్రవహిస్తోంది. చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మంగళవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో పెదబయలు పలు ప్రదేశాల్లో విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు విరిగి పడడంతో 12 గంటల పాటు అంతరాయం ఏర్పడింది.



ముంచంగిపుట్టులో ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



హుకుంపేట మండలంలోని నీటమునిగిన పంటపొలాలు

కూలిన భారీ వృక్షాలు, ఇళ్లు

గూడెంకొత్తవీధి/చింతపల్లి రూరల్/జి.మాడుగుల: గూడెం కొత్తవీధి మండల కేంద్రంలోని బోడకొండమ్మ ఆలయం ఎదుట ఉన్న భారీ మామిడిచెట్టు మంగళవారం తెల్లవారుజామున నేలకూలింది. ఈ మామిడి చెట్టుకు చారిత్రక నేపథ్యం ఉంది. ఇక్కడ బోడ కొండమ్మ ఆలయంతో పాటు సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాలున్నాయి. పూర్వీకుల నుంచి ఇక్కడ అమ్మవారి జాతరలు జరుగుతున్నాయి. వందల ఏళ్ల నాటి మహా మామిడి వృక్షం గాలివానకు ఇలా వేళ్లతో సహా నేలకూలడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటన సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు హుటాహుటిన పొక్లెయిన్‌తో చెట్టును తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు.

మండలంలోని నిమ్మలపాలెంలో సలిమితి సింహాచలం అనే గిరిజన రైతుకు చెందిన పశువుల పాక నేలమట్టమైంది. దీంతో పాకలో ఉన్న పశువులకు గాయాలయ్యాయి. అధికారులు, యంత్రాంగం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. చింతపల్లి మండలంలోని లంబసింగి –తాజంగి గ్రామాల మధ్య రోడ్డుకి అడ్డంగా భారీ వృక్షం బుధవారం నేలకూలింది.దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, వృక్షాన్ని తొలగించారు. కొత్తపాలెం పంచాయతీ కిన్నెర్ల రామ్ నగర్ గ్రామంలో గెమ్మెలి సీతమ్మ ఇంటి గోడ కూలిపోయింది.ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

జి.మాడుగుల మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గెమ్మెలి పంచాయతీ కుల్లుపాడు గ్రామంలో బుధవారం ఒక పెంకుటిల్లు గోడ కూలిపోయింది. కుల్లుపాడు గ్రామానికి చెందిన కొరుకోల కొండమ్మకు చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోవడంతో ఆమె నిరాశ్రురాలైంది. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించి, పక్కా ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధిత గిరిజన మహిళ కోరారు.



గూడెంకాలనీలో కూలిన భారీ వృక్షం



లంబసింగి, తాజంగి గ్రామాల మధ్య కూలిన వృక్షం



నిమ్మలపాలెంలో కూలిన పశువులశాల



కులుపాడులో కూలిన పెంకుటిల్లు గోడ

పౌష్టికాహారం తీసుకోవాలి



నిమ్మలపాలెంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: గర్భిణులు, బాలింతలు ,విధిగా ఆకు కూరలు తీసుకోవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. బలమైన ఆహారం తీసుకోకుంటే రక్త హీనత సమస్య ఉండదన్నారు. డొనూరు పంచాయతీలో నిమ్మలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడి, ఆరోగ్య భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.

తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



బర్రెమామిడిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న రాధాకృష్ణ తదితరులు

పెదబయలు: గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గిరిజన ప్రాంతంలో ఇళ్లు కూలిపోయిందని చాలా కుటుంబాలు నిరాశ్రయులయ్యారని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని కుంతుర్ల పంచాయతీ బర్రెమామిడి గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామంలో కించాయి సింహాచలం నివాసం ఉంటున్న ఇల్లు సగం కూలిపోవడం వల్ల ధాన్యం, వంట సామగ్రి ధ్వంసమైందని, అలాగే ముంచంగి రాజుబాబు, లోచలి నూకలమ్మ, వంతాల చిట్టినాయుడు ఇంటి గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, గ్రామానికి చెందిన రైతుల అరటి తోటలు, మొక్కజొన్న, కందుల మొక్కలు ఈదురు గాలులకు నేలరాలయాన్నారు. తెరిపివ్వని వర్షాలకు ఇళ్లు కూలి నిరాశ్రయులైన బాధితులకు ప్రభుత్వం ఆదుకోవడం లేదని, నష్టాలపై ప్రభుత్వం, అధికారులు సర్వే చేయడం లేదన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి కొత్త గృహాలు మంజూరు చేయాలని, పంటలు నష్టపోయిన వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాలంనాయుడు, రమణదొర, సింహాచలం, రాజు పాల్గొన్నారు.


గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు



ఆకుమామిడికోటలో గిరిజనులకు తాగునీటిని సరఫరా చేస్తున్న ఎంపీడీవో వీర కిషోర్

మారేడుమిల్లి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలి పోవడంతో మండలంలోని పుల్లంగి, అద్దర వీధి, ఆకుమామిడికోట, చావడికోట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు గత వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామ గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వీర కిషోర్ బుధవారం పంచాయతీ సిబ్బంది తగు సూచనలు చేసి ఆయా గ్రామాలకు జనరేటర్ పంపించి మోటార్లుకు వాటి అనుసంధానించి తాగు నీరు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయ గ్రామాలకు విద్యుత్ సరఫరాను త్వరగతిన పునరుద్ధించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైన చెట్లు కూలితే వాటిని తొలగించడానికి ఇద్దరు వుడ్ కట్టర్స్ ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. కాచి వడచేసిన నీటిని తాగాలన్నారు. ట్యాంక్‌లో క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేస్తున్నామన్నారు. దోమలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఫాగింగ్, మలేరియా స్ప్రే చేయిస్తామన్నారు. సర్పంచ్ జార్జిబాబు, ఏవో జయంతి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య తదితరులు

పెదబయలు: ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన గృహ నిర్మాణ లబ్ధిదారులు 90 రోజుల పనిదినాలు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య అన్నారు. స్థానిక ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో గృహ నిర్మాణ, ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు వేగవంతం చేయాలని ఈ ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం 2021–22 సంవత్సరంలో మండలంలో 600 మందికి గృహాలు మంజూరు చేశామన్నారు. ఇందులో భాగంగా కొన్ని నిర్మాణాలు పూర్తి చేయగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకుగాను 90 రోజుల పనిదినాలు ఉపాధి పథకం ద్వారా పనులు చేసి లబ్ధిదారులకు తోడ్పాటునందించాలని కోరారు. గృహనిర్మాణ శాఖ ఏఈ ఈశ్వరి, ఈవోఆర్‌డీ నర్సింగరావు, ఏపీవో చిన్న అప్పలనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు



దీపం వెలుగులోని గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల మారుమూల భూసిపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు పెదబయలు మండలం జామిగూడ, గిన్నెలకోట పంచాయతీల్లోని సుమారు 60 గ్రామాలు గత నెల రోజులుగా అంధకారంలో ఉంది. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులకు పలు మార్లు సమస్యను తెలియజేసినా కనీస స్పందన లేదని, రాత్రి పూట అంధకారంలో భయం భయంగా ఉంటున్నామని, విష సర్పాలు, అడవి జంతువులతో ప్రతి క్షణం భయపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక గిరిజన ఉపాధ్యాయ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ఎటపాక: పాడేరు, రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన ఉపాధ్యాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను బుధవారం ప్రకటనలో కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలంలో ఒక్క బీఈడీ కాలేజీ ఉందని, విభజన ఒప్పందం గత ఏడాదితో ముగిసిందని పేర్కొన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థులకు ఉపాధ్యాయ విద్య కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏజెన్సీలో రెండు ఉపాధ్యాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

అధ్వానంగా కోనాపురం రహదారి



కోతకు గురై అధ్వానంగా మారిన కోనాపురం తారురోడ్డు

అనంతగిరి: మండలంలోని కోనాపురం తారు రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఎక్కడికక్కడ గోతులమయంగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాల కారణంగా కోతకు గురైంది, మరికొన్ని చోట్ల పూర్తిగా రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు నిర్మించినప్పటి నుంచి నేటికి మరమ్మతులు నోచుకోకపోవడంతో రోడ్డంతా అధ్వానంగా తయారైంది. బొర్రా నుంచి కోనాపురం వరకు రాకపోకలు సాగించేందుకు ప్రయాణాలకు భయాందోళన చెందుతున్నారు. అత్యవసర సమయంలోని గ్రామాలకు వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ద్విచక్ర వాహనాలపై గిరిజనులు ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తారురోడ్డు మరమ్మతులు చేపట్టి పరిష్కరించాలని కోరుతున్నారు.

వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తం



గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మారేడుమిల్లి: మండలంలోని జి.ఎం.వలస పంచాయతీ పరిధిలోని ఉత్తలూరు గ్రామంలో రాజమహేంద్రవరం ఆర్‌ఎస్ స్వేచ్ఛ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ కె.స్వాతి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ స్వాతి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనిపై సూచనలిచ్చారు. తమ సంస్థ ద్వారా ఏజెన్సీలో అనేక గిరిజన గ్రామాలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్స్. గ్రామస్తులకు చార్జింగ్ లైట్లు, దుస్తులు, దుప్పట్లు, తదితర సామగ్రి పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.

బాధితులకు సరకుల పంపిణీ



పనస గ్రామంలో బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రఫీజాన్

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో ఈదురుగాలులకు చెట్టు పడి మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రఫీజాన్, రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వం తరుపున సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. సర్పంచ్ మిల్కి, డీటీ అప్పలస్వామి, రెవెన్యూ అధికారులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గంగవరం/రాజవొమ్మంగి: పిడతమామిడిలో మండల ఎమ్మార్పీఎస్ కార్యదర్శి మోషే ఆధ్వర్యంలో డాక్టర్ నిడమర్తి చినబాబు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదిగ బిడ్డల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అర్జున్, చిట్టిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. బుజ్జి, తాతారావు, జీవరత్నం, కామరాజు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి



బుధకోటలో గిరిజనులకు మందులు పంపిణీ చేస్తున్న గుర్తేడు ఎస్‌ఐ సాయి కుమార్

మారేడుమిల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలు సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గిరిజనులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుర్తేడు ఎస్‌ఐ సాయి కుమార్ అన్నారు. ఆయన బుధవారం తన సిబ్బందితో కలిసి పాతకోట, బురదకోట గ్రామాల్లో పర్యటించారు. అక్కడి గిరిజనులతో సమావేశం నిర్వహించి, సీజన్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావలని సూచించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది



కామయ్యపేటలో గ్రామస్తులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి శాంతి

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో 86 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు డాక్టర్ నాగార్జున తెలిపారు. ఈ క్యాక్రమంలో జడ్డంగి పీహెచ్‌సీ సిబ్బంది సేవలందించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి అవసరమైన సలహాలు, ఆరోగ్య సూచనలిచ్చారు. బీపీ సుగర్ సమస్యలున్న వారికి మందులు ఇచ్చారు. సీజల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటినే తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, ఏఎన్‌ఎం మల్లేశ్వరి, 104 డీఈఓ శ్రీనివాస్, సచివాలయసిబ్బంది, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు. గురువారం నుంచి చింతూరులో వరదల కారణంగా గురువారం నుంచి చింతూరు తదితర ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు డాక్టర్ నాగార్జున తెలిపారు.

హుకుంపేట: సీజనల్ వ్యాధులపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేటలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 52 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గిరిజనులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రోజు వేడి నీరు తాగాలని సూచించారు. వైద్య సిబ్బంది నాగమణి, భవాని పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



దారాలమ్మ ఘాట్ రహదారిలో బస్సును ఢీకొన్న జీపు

సీలేరు: గూడెంకొత్త వీధి మండలం ధారాలమ్మ ఘాట్ రోడ్డు బస్సును జీపు ఢీకొన్న ఘటన బుధవారం ఉదయం జరిగింది. నర్సీపట్నం నుంచి సీలేరు వెళ్తున్న ఏపీ 31జెడ్0551 నంబర్ గల ఆర్టీసీ బస్సు, ధారకొండ నుంచి చింతపల్లి వెళ్తున్న ప్రైవేటు జీపు ధారాలమ్మ ఘాట్ రహదారిలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికి ఏమి కాలేదు. అయితే వర్షానికి తుప్పలు బాగా పెరిగిపోవడంతో పాటు రహదారి సరిగా లేక ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఈ సంఘటన జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అదే విధంగా జీపు ముందు చక్రం బస్సు కింద ఇరుక్కుపోయిందని లేనిపక్షంలో జీపు పక్కనున్న లోయలో జారీపడిపోయి ఉండేదని స్థానికులు తెలిపారు.